ఏఎస్‌రావునగర్ అభివృద్ధికి సహకరించండి


మంత్రి శ్రీధర్‌బాబుతో పజ్జూరి పావనీరెడ్డి

కాప్రా: డాక్టర్ ఏఎస్‌రావునగర్ డివిజన్ అభివృద్ధికి సహకరించాలని మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి కోరారు. మంగళవారం ఉప్పల్ పర్యటనకు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఆమె డివిజన్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని విన్నవించారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించినట్లు ఆమె పేర్కొన్నారు. కాప్రా ప్రాంతంలో త్వరలోనే పర్యటిస్తానని చెప్పినట్లు మాజీ కార్పొరేటర్ వివరించారు. బొజ్జా రాఘవరెడ్డి, చిందం బాల్‌నర్సింహ, చెప్యాల నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం


ట్రోఫీని అందుకుంటున్న విద్యార్థులు

మల్లాపూర్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని శ్రీ చైతన్య ఏజీఎం మహ్మనూరు అలీ అన్నారు. విద్యాసంస్థల అధినేత బీఎస్‌రావు జ్ఞాపకార్థం నిర్వహించిన క్రీడాపోటీల్లో నాచారం బ్రాంచ్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. రీజనల్ ఇన్‌చార్జి మల్లికార్జున్‌నాయుడు, జోనల్ కో– ఆర్డినేటర్స్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే శ్రీరామ్ ఎన్నికపై హర్షం


కరాటే శ్రీరామ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మల్లాపూర్: దళిత సంఘాల జేఏసీ కన్వీనర్‌గా కరాటే శ్రీరామ్ ఎన్నికకావడం అభినందనీయమని నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ అన్నారు. మంగళవారం నాచారం కార్పొరేటర్‌ను దళిత సంఘాల జేఏసీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కరాటే శ్రీరామ్‌ను కార్పొరేటర్ శాలువాతో సత్కరించారు. నల్ల రాధాకృష్ణ, వేముల మారయ్య, అంజి, వెంకటేష్, కర్ణ సంతోష్, మస్తాన్, అశోక్‌కుమార్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం


జాషువా

మేడిపల్లి: ఓ బాలుడు అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి పరిధిలోని శ్రీకృష్ణానగర్ పీర్జాదిగూడలో నివాసం ఉంటున్న నేతల నారాయణమూర్తి కుమారుడు జాషువా (15) గత కొద్ది రోజులుగా సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తున్నాడని తండ్రి మందలించడంతో ఇంట్లో నుంచి సోమవారం రాత్రి 8.00 గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం కుటుంబసభ్యులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరోచోట సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..


సందీప్

మేడిపల్లి: పూణేలో ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న ఓ యువకుడు అదృశ్యమైన ఘటన ఈనెల 9న చోటు చేసుకుంది. మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లిలోని బుద్ధానగర్‌లో నివసించే శ్రీనివాస్ కుమారుడు సందీప్(24) పూణేలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కాగా ఈనెల 9న ఇంటికి వస్తున్నానని కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు ఫోన్ చేయగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని తన స్నేహితుల వద్దకు వెళ్తున్నానట్లు చెప్పాడు. తిరిగి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పల్ బ్యాంక్ కాలనీలో పేరుకుపోయిన మురుగు





నత్తనడకన అభివృద్ధి పనులు !

- ఐదేళ్లుగా పూర్తికాని వరద నీటి కాలువ
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో వరదనీటి కాలువల అభివృద్ధి పనుల్లో ఏళ్లు గడుస్తున్నా సంబంధిత అధికారుల్లో చలనం కనిపించడం లేదు. 6 నెలల్లో పూర్తిచేయాల్సిన పనులు ఐదేళ్లైనా పూర్తి కాలేదు.

రూ.కోటిన్నర నిధులు మంజూరు..

దాదాపుగా ఐదేళ్ల క్రితం చిలుకానగర్ డివిజన్ బ్యాంక్ కాలనీ ప్రధాన రహదారిపై నాలా అభివృద్ధి కోసం రూ. కోటిన్నర నిధులు మంజూరై టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. పనులు ప్రారంభించినా సదరు కాంట్రాక్టరు పనులను చూసి వెళ్తున్నారే తప్పా.. ఎలాంటి పనులు జరగడం లేదని స్థానికులు వాపోతున్నారు.

30 శాతం కూడా పూర్తికాని పనులు..

కేవలం 30 శాతం పనులు కూడా పూర్తికాకపోవడంపై అధికారులు, కాంట్రాక్టర్ల పనితీరుకు అద్దం పడుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్‌తో చేతులు కలపడం వల్లే కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు మందలించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వర్షం వచ్చినప్పుడల్లా తీవ్ర ఇబ్బంది..

బ్యాంక్ కాలనీ బేకరి నుంచి ఆదర్శ్‌మార్ట్ వరకు రోడ్డుకు ఓ వైపు వరదనీటి కాలువ చిన్నదిగా ఉండటం వల్ల వర్షం వచ్చినప్పుడల్లా ఇళ్లలోకి వరద నీరు చేరడం లాంటి సమస్య తీవ్రంగా ఉండేది. దీంతో పలు కాలనీల అసోసియేషన్ల అభ్యర్థన మేరకు అధికారులు వరదనీటి కాలువ విస్తరణకు 2021లో రూ.కోటిన్నర నిధులను విడుదల చేశారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి వదిలేశాడు.

అసంపూర్తిగా బాక్స్‌డ్రెయిన్ పనులు..

గత 6 నెలల క్రితం కొద్దిపాటి మేర ఉన్న పైపులైన్లను తొలగించి బాక్స్‌డ్రెయిన్స్ నిర్మించి కాంట్రాక్టర్ వదిలేశాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు ప్రారంభించకపోవడంతో వరద నీటికాలువ పూర్తిగా మురుగుతో నిండి రోడ్డుపై పారుతోంది. మరికొన్నిచోట్ల మురుగు ఇళ్లలోకి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

మురికివాడగా కాలనీ..

ఉప్పల్ సర్కిల్ పరిధిలో బ్యాంక్ కాలనీకి మంచిపేరుంది. అలాంటి కాలనీ నేడు అధికారుల నిర్లక్ష్యం కారణంగా మురికివాడగా మారుతోంది. వర్షపు నీటికాలువ పూర్తిగా మురుగుతో నిండిపోయింది. దీనిపై జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్‌పాటిల్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మికి కూడా ఫిర్యాదు చేసాం.

– తుమ్మల సందీప్‌భూషన్, స్థానికుడు

బడ్జెట్‌ను రీవాల్యేషన్‌కు పంపాం..

పనులు ఆలస్యం కావడం వల్ల సదరు ఏజెన్సీకి నోటీసులు జారీ చేశాం. బడ్జెట్‌ను రీవాల్యేషన్‌కు పంపాం. రీవాల్యేషన్ వచ్చిన 2 నెలల్లో పనులు పూర్తి చేస్తాం.

– డీఈఈ వనీత్‌కుమార్

ప్రభుత్వ భూములను పరిరక్షించుకుందాం !

బోడుప్పల్: ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి పరిరక్షించుకుందామని, బోడుప్పల్ బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం గౌతమీనగర్ కాలనీలో బీఆర్‌ఎస్ నేతలతో కలిసి మాట్లాడుతూ.. 12,13 డివిజన్‌లలో ప్రభుత్వ స్థలం కనపడితే రాత్రికిరాత్రే నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే తూతూమంత్రంగా కూల్చివేస్తున్నారని, తిరిగి రెండ్రోజుల్లో యధావిధిగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. బిస్కెట్ గోడౌన్ వద్ద ప్రభుత్వ స్థలంలో మూడు నిర్మాణాలు చేపట్టారని వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ప్రభుత్వ భూములు కాపాడితే ప్రస్తుత ప్రభుత్వంలో కబ్జాలకు గురవుతున్నాయన్నారు. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టే దళారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. 12వ డివిజన్ ఇన్‌చార్జి చంటి శ్రీనివాస్, నాయకులు బోడగల్ల సదానంద్, కాలనీవాసులు పాల్గొన్నారు.


ప్రభుత్వ స్థలాల వివరాలు వెల్లడిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి

మల్కాజిగిరి: ఓల్డ్ నేరేడ్‌మెట్ ప్రాంతంలోని సమస్యలు పరిష్కరిస్తానని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. మంగళవారం పర్యటించిన ఆయన పలు సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరారు. కొన్నిచోట్ల వీధిదీపాలు అవసరం ఉన్నాయని, మరి కొన్నిచోట్ల మరమ్మతులు చేయించాలని ఆయనకు వివరించారు. పేదింటి ఆడపిల్ల వివాహానికి రూ.5000 సాయం అందజేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ శ్వేత



అల్వాల్: అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ శ్వేత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అల్వాల్‌లో పదవీబాధ్యతలు తీసుకున్న డాక్టర్ శ్వేత డిప్యూటేషన్‌పై శామీర్‌పేట్ వెళ్లి విధులు నిర్వహించి, అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తి బాధ్యతలు తీసుకున్నారు.

మహిళా సిబ్బందికి సత్కారం

గౌతంనగర్: మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రైల్వేస్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సౌత్ సెంట్రల్ రైల్వే మహిళా అధికారులు, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్లు సుచరిత రెడ్డి, భాగ్యం, మల్కాజిగిరి టెలికాం వందన, లిల్లీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అజ్రా సయీద్, మల్కాజిగిరి ఆర్‌పీఎఫ్ సునీత, మహిళ సిబ్బందిని వారు శాలువాలతో సత్కరించారు. భరద్వాజ్, ఏవీ.స్వామి, శంకర్‌రావు, సుధ, వినయ్ తదితరులున్నారు.

వెంకటాపురంలో..

అల్వాల్: తెలంగాణ మహిళా మండలి, వైష్ణవి పొదుపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వెంకటాపురంలో మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా మండలి సంఘం ప్రతినిధులు వీణాసుదేష్, వాణి, సుజాత, స్వరూప, లక్ష్మి, మల్లిక తదితరులున్నారు.


మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌లో మహిళా సిబ్బందిని సత్కరిస్తున్న దృశ్యం

అక్రమ కమర్షియల్ షెడ్డుపై అధికారుల చర్యలు


కమర్షియల్ షెడ్డును సీజ్ చేసిన అల్వాల్ జీహెచ్‌ఎంసీ అధికారులు

అల్వాల్: నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కమర్షియల్ షెడ్డును మంగళవారం అల్వాల్ జీహెచ్‌ఎంసీ అధికారులు సీజ్ చేశారు. అల్వాల్ సర్కిల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. లోతుకుంట నుంచి వెంకటాపురానికి వెళ్లే ప్రధాన రహదారిలో నిర్మించిన కమర్షియల్ షెడ్డుకు పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్మాణం నిలిపేయకుండా నిర్మించడంతో పాటు వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించారన్నారు. కోర్టు ఆదేశాలనుసారంగా మంగళవారం పోలీసుల సాయంతో వాణిజ్య షెడ్డును సీజ్ చేశామన్నారు. ఇప్పటివరకు అల్వాల్ సర్కిల్ పరిధిలో 9 అక్రమ నిర్మాణాలను సీజ్ చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. టౌన్‌ప్లానింగ్ డీసీపీ సాంబయ్య, సెక్షన్ అధికారి హఫీజ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పవర్‌బోర్‌కు మరమ్మతులకు కృషి


కాలనీలో పర్యటిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు రాముయాదవ్

గౌతంనగర్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, గౌతంనగర్ కార్పొరేటర్ మేకల సునీతారాము యాదవ్ ఆదేశాల మేరకు మంగళవారం గౌతంనగర్ డివిజన్ ఈస్ట్ ఇందిరానెహ్రూనగర్‌లో బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు మేకల రాముయాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో గౌతంనగర్ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో నీటి ఎద్దడి నివారణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలో పాడైన పవర్‌బోరును తన సొంత నిధులతో మరమ్మతులకు చర్యలు చేపడతానన్నారు. నాయకులు వెంకన్న, బైరు అనిల్, కాటంరాజు, శ్రీనివాస్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

ఉప్పల్: 'ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం' అనే శీర్షికన మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఉప్పల్ రెవెన్యూ అధికారులు స్పందించారు. మంగళవారం సదరు స్థలంలో ప్రభుత్వ బోర్డును ఏర్పాటు చేశారు. ఉప్పల్ టీచర్స్ కాలనీలో ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ స్థలంగా సర్వే నెంబర్‌ను మార్చి కబ్జాకు యత్నిస్తుండగా స్థానికులు అడ్డుకున్న విషయం తెలిసిందే. చిలుకానగర్ డివిజన్ పరిధిలో సీతారామకాలనీ, టీచర్స్‌కాలనీల మధ్య ఉన్న రూ. కోట్ల విలువైన ఖాళీ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు చదును చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. అధికారులు సానుకూలంగా స్పందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



టీపీసీసీ చీఫ్‌ను కలిసిన స్థానిక నేతలు

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు సుధాకర్‌శెట్టి, చల్ల సుధాకర్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పార్టీ జెండాలు మోసిన వారికి సముచిత స్థానాన్ని కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి పదవులు ఆశించకుండా సేవ చేశామని పార్టీ ఆదేశాలను పాటిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ పార్టీకి అండగా నిలిచామన్నారు. దీనిపై స్పందించిన ఆయన పార్టీని నమ్ముకున్నవారిని వదులుకోమని త్వరలో మంచి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



క్లినిక్‌లు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు


ఆసుపత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమాగౌరీ

మల్కాజిగిరి: ఆసుపత్రులు, క్లినిక్‌లు నిబంధనలు పాటించకపోతే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమాగౌరీ అన్నారు. మంగళవారం మల్కాజిగిరి ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని అనుకృష్ణ, డీఎం ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో డాక్టర్లు అందుబాటులో లేకపోవడం, వైద్యులు సంతకాలు, తదితర లోపాలను గుర్తించామన్నారు. అనుకృష్ణ ఆస్పత్రిని సీజ్ చేసి, డీఎం ఆస్పత్రికి నోటీసులు జారీ చేశామన్నారు. ఉప జిల్లా వైద్యాధికారి డాక్టర్ శోభారాణి, డాక్టర్ వినోద్ పాల్గొన్నారు.

త్వరలోనే స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి తదితరులు

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌లో నిర్మించతలపెట్టిన మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు త్వరలోనే ప్రారంభంకానున్నాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం హెచ్‌బీకాలనీ, బండబావి వద్ద నిర్మించతలపెట్టిన మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్ స్థలాన్ని జెడ్సీ హేమంత్ కేశవ్‌పాటిల్, కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పనులను త్వరితగతిన ప్రారంభించేలా చూడాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జెడ్సీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, కాప్రా సర్కిల్ డీసీ జగన్‌నాయక్, ప్రాజెక్టు అధికారులు భాస్కర్‌రెడ్డి, నిత్యానందం, వెంకట్‌రెడ్డి, ఈఈ నాగేందర్, డీఈ ఉమారాణి, రోహిణి, భరత్, ఇంజినీరింగ్ డీఈ రూప, ఏఈ లింగారావు స్థానిక నేతలు జంపాల్‌రెడ్డి, నవీన్‌గౌడ్, నరేందర్, నిసార్ అహ్మద్‌గోరి తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థులకు చేయూత

- ఎమ్మెల్యేను అభినందించిన మంత్రి శ్రీధర్‌బాబు


మంత్రి చేతుల మీదుగా వైద్య విద్యార్థులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం

కాప్రా: ఎంబీబీఎస్ సీటు సాధించి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వైద్య విద్యార్థులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బాసటగా నిలుస్తున్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో డాక్టర్ కావాలనే కలతో ఉండి ఆర్థికంగా తమ లక్ష్యాన్ని చేరుకోలేని విద్యార్థులకు ఆర్థికసాయం అందించి వారి కలను ఎమ్మెల్యే నెరవేరుస్తున్నారు. తన నియోజకవర్గంలో అలాంటి విద్యార్థులున్నారని, తెలిస్తే చాలు వారికి తనవంతు సాయంగా ఆర్థికంగా చేయూతనందిస్తున్నారు. దీనిలో భాగంగా 13 మంది విద్యార్థులకు మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా మంగళవారం రూ.5.21 లక్షల చెక్కులను అందజేశారు. పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యేను మంత్రి శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా అభినందించారు.

రేపటి నుంచి సత్యదేవుని బ్రహ్మోత్సవాలు


విద్యుత్ అలంకరణతో స్వాగత ద్వారాలు


స్వామివారి మూలవిరాట్

రామంతాపూర్ : ఇందిరానగర్‌లో వెలిసిన రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలోని స్వామివారిని ఆరాధిస్తే భక్తుల కొంగు బంగారంగా కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల అపార నమ్మకం. ఈనెల 12 నుంచి 16 వరకు నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ ఈవో విజయభారతి, ఫౌండర్ ట్రస్టింగ్ కోట్ల నరసింహ్మారెడ్డి తెలిపారు.

విద్యుత్ దీపాలతో అలంకరణ..

విద్యుత్ దీపాల అలంకరణలతో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలకు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 13న రాత్రి 7 గంటలకు ఎదుర్కోళ్లు, 14న ఉదయం 11 గంటలకు స్వామివారి కల్యాణం, 15న రథోత్సవం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, భేతి సుభాష్‌రెడ్డితో పాటు కార్పొరేటర్లు శ్రీవాణి, చేతన, రజితారెడ్డి హాజరవుతారని తెలిపారు.

DOCUMENT LOST
I, JUKURI RAJINI W/o. BALTHU SRINIVAS, Aged About 47 Years, Occ: House Wife, R/O. H.No. 2-147, Sai Homes Gurramguda, Saroornagar Mandal, R.R. Dist, Telangana State, Lost my Original Gift Deed Document bearing No. 4814/2020 at SRO Narapalli while I Was Travelling by Bus on 05-08-2024. If Anyone Found Please Contact : 8919716668.



డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ


సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ ఉమాగౌరి

బోడుప్పల్: అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) బోడుప్పల్‌ను మంగళవారం మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి డాక్టర్ ఉమాగౌరి సందర్శించారు. సిబ్బంది హాజరు, ఓపీ సేవలు, స్టాక్ రికార్డులు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్యాధికారులు, సిబ్బంది రోగుల సేవలు, డయగ్నస్టిక్ సేవలను మెరుగుపర్చేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరపరిధిలోని పలు ప్రధాన కూడళ్లలో మున్సిపల్ అధికారులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని కమిషనర్ త్రిలేశ్వర్‌రావు ఆదేశాల మేరకు అధికారులు నగర పాలక సంస్థ పరిధిలోని లేబర్‌అడ్డ, ఉప్పల్ బస్‌డిపో, డిమార్టు, పీర్జాదిగూడ కమాన్, ఎమ్మార్వో కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తాగునీటిని అందించేందుకు సిబ్బందిని నియమించారు.



13న ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ఉప్పల్: ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 13న ఉదయం 10.30 గంటల నుంచి టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా ఉంటుందని ప్రిన్సిపాల్ డా.కె.విజయ్‌కుమార్ తెలిపారు. ఓ కంపెనీలో అసెంబ్లింగ్ ఆపరేటర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కోరారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు అర్హులని ప్రకటించారు. మరిన్ని వివరాలకు 9059823318.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376
9912225470
9912220571